నెరవేరనున్న వారధి కల

- రూ.11.55కోట్లతో నక్కవాగు బ్రిడ్జి పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామాల ప్రజలు


నక్కవాగు బ్రిడ్జిపై ప్రారంభమైన పనులు

వేములవాడరూరల్: ఎన్నో ఏళ్లుగా ఆ రహదారి గుండా గ్రామాల ప్రజలు ప్రతి వర్షాకాలం ఇబ్బందులు పడుతున్నారు. ఈ వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని ఎన్నోసార్లు గత పాలకులు, అధికారులకు మొర పెట్టుకున్నారు. అయినప్పటికీ 60 ఏళ్లుగా సమస్య పరిష్కారం కాలేదు. ఎట్టకేలకు నక్కవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.11.55కోట్ల నిధులను మంజూరయ్యాయి. దీంతో ఎట్టకేలకు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణం కోసం పనులు ప్రారంభించడంతో.. ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలు బంద్

వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట గ్రామం వద్ద ఉన్న నక్కవాగులో వర్షాకాలంలో నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతాయి. ఈ రహదారి గుండా హన్మాజిపేట, లింగంపల్లి, బొల్లారం గ్రామ ప్రజలతో పాటు కోనరావుపేట మండల ప్రజలు, నిజామాబాద్ జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు వేములవాడకు వస్తుంటారు. ప్రతిరోజు వందలాది మంది వాహనదారులు కూడా ఈ నక్కవాగుపై వేములవాడకు చేరుకుంటారు. వర్షాకాలంలో నీరు ప్రవహించడంతో రెండు, మూడు రోజులు ఈ నక్కవాగుపై రాకపోకలను పోలీస్, రెవెన్యూ అధికారులు నిలుపుదల చేస్తారు. దీంతో సిరిసిల్ల, కోరుట్ల మీదుగా ప్రజలు ప్రయాణించాల్సి వస్తోంది. ప్రస్తుతం ఈ నక్కవాగు పనులు పూర్తయితే దూరభారంతో పాటు వర్షాకాలంలో ఈ ప్రాంత ప్రజలకు కష్టాలు తప్పనున్నాయి. మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రత్యేక చొరవతో ఈ నిధులను మంజూరు చేయడంతో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.

ఎన్నో ఏళ్ల కల



హన్మాజిపేట నక్కవాగు నీటి ప్రవాహంతో ప్రతి సంవత్సరం వర్షాకాలం ఇబ్బందులు పడుతున్నాం. ఈ వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని గతంలో ఉన్న ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొర పెట్టుకున్నారు. అయినప్పటికీ స్పందన లేదు. ఎట్టకేలకు మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రత్యేక చొరవతో నిధులు మంజూరయ్యాయి.

– జంకె శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, హన్మాజిపేట

బాధలు తప్పనున్నాయి



వర్షాకాలంలో మా గ్రామానికి రాకపోకలు నిలిచిపోతే ఎంతో ఇబ్బంది పడుతాం. వర్షాకాలం ఈ వాగుపై నీరు పారడంతో పంట పొలాలకు కూడా పోలేకపోతున్నాం. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మా గ్రామస్తులతో పాటు మరెన్నో గ్రామాలకు కష్టాలు తప్పనున్నాయి.

– మ్యాన హరినందన్‌రెడ్డి, రైతు, హన్మాజిపేట

త్వరగా పూర్తి చేయాలి



ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని నక్కవాగు బ్రిడ్జి నిర్మాణం ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించడం సంతోషంగా ఉంది. వచ్చే వర్షాకాలం వరకు ప్రజలకు ఇబ్బందులు కాకుండా పనులు పూర్తి చేయాలి.

– తీగల ఎల్లాగౌడ్, గీత కార్మికుడు, హన్మాజిపేట

క్లుప్తంగా

దివ్యాంగురాలికి బ్యాటరీ ట్రైసైకిల్ అందజేత



తంగళ్లపల్లి: మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమ ఆవరణలో గ్రామానికి చెందిన దివ్యాంగురాలు మొహమ్మద్ గౌసియాకు ప్రభుత్వం నుంచి బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్‌ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం కోఆర్డినేటర్ ఎం.మమత, నాయకుడు బుస్స లింగం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులపై చర్చకు రావాలి

కోనరావుపేట: మండలానికి ఎంపీ బండి సంజయ్ తెచ్చిన నిధులపై కాంగ్రెస్ నాయకులు బహిరంగ చర్చకు రావాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, మండల శాఖ అధ్యక్షుడు గొట్టె రామచంద్రం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు కోనరావుపేటకు వచ్చిన నిధుల గురించి తెలుసుకోకుండా మాట్లాడడం సరికాదన్నారు. శనివారం కోనరావుపేటకు వస్తే అంబేడ్కర్ చౌరస్తా వద్ద చర్చకు సిద్ధమని అన్నారు. నాయకులు మిర్యాల్‌కార్ బాలాజీ, రవి, తిరుపతి, జింక వెంకటి, బెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, జితేందర్, ఆకుల నాగరాజు, గొట్టె ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

45 ఏళ్ల నుంచి వేములవాడను గుర్తించలేదు

కోనరావుపేట: 45 సంవత్సరాల కాలం నుంచి వేములవాడ నియోజకవర్గాన్ని ఎవరూ గుర్తించలేదని, ప్రాంత సమస్య గురించి అసెంబ్లీలో మాట్లాడినవారు లేరని బావుసాయిపేట ఎంపీటీసీ షేక్ యాస్మిన్ పాషా అన్నారు. కొన్నేళ్ల నుంచి ఎమ్మెల్యేగా పని చేసినవారు వేములవాడ, కోనరావుపేట ప్రాంతాల సమస్య గురించి అసెంబ్లీలో ప్రస్తావించలేదని, ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదన్నారు. స్థానికంగానే నివాసముండే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఈ ప్రాంత సమస్యలపై మాట్లాడడం హర్షణీయమన్నారు. ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని, యువతకు నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలుకుతున్నారని బీఆర్ఎస్ యూత్ వింగ్ మండల నాయకులు సింగారం దేవరాజు, కొత్రి అనిల్, ల్యాగల సతీష్ అన్నారు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం మాట్లాడారు. నర్సింగ్ ఆఫీసర్స్ 6,956, సింగరేణి 441, కానిస్టేబుల్ 15,750 ఉద్యోగాలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలేనని అన్నారు. నాయకులు అజ్మీరా తిరుపతినాయక్, సింగారం మధు, మునిగే ప్రమోద్, కళ్యాణ్, సీత్యానాయక్, సురభి కాంతారావు, దేవీలాల్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను విమర్శించే స్థాయి ఎంపీకి లేదు

తంగళ్లపల్లి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు లేదని జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు. గురువారం ప్రజాహిత సంగ్రామ యాత్రలో భాగంగా తంగళ్లపల్లిలో కేటీఆర్‌పై బండి సంజయ్ విమర్శలు చేయడాన్ని ఖండించారు. బీఆర్ఎస్ నాయకులు కొయ్యడ రమేశ్, సిలివేరి చిరంజీవి, ఆత్మకూరి చంటియాదవ్, ఎండీ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

'గత ప్రభుత్వంలో నిర్వాసితులకు న్యాయం జరగలేదు'

వేములవాడఅర్బన్: గత ప్రభుత్వంలో మిడ్‌మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు న్యాయం జరగలేదని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎర్రం రాజు, ప్రధాన కార్యదర్శి చింతపల్లి శ్రీనివాసరావు అన్నారు. అనుపురంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలకులు నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారన్నారు. రాజన్నకు ఏటా రూ.100కోట్లు ఇస్తామని ఇవ్వలేదని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిర్వాసితుల బాధలను అసెంబ్లీలో సీఎం దృష్టికి తీసుకెళ్లారన్నారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రతిభా పరీక్ష సద్వినియోగం చేసుకోవాలి

వీర్నపల్లి: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా పదోతరగతి విద్యార్థులకు ఈనెల 19, 20ల్లో నిర్వహించే టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్‌కుమార్ కోరారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. నాయకులు కిరణ్, ప్రవీణ్, ఉపాధ్యాయులు టి.శ్రీనివాస్, రమేశ్, కృష్ణవేణి పాల్గొన్నారు.

'గృహజ్యోతి' లబ్ధిదారుల వివరాల నమోదు


తడగొండలో వివరాలు సేకరిస్తున్న సెస్ సిబ్బంది

బోయినపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గృహజ్యోతి పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం సెస్ సిబ్బంది సెస్ వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లుల వివరాలు తీసుకొని నమోదు చేశారు. వినియోగదారుల ఇళ్లలోకి వెళ్లి వారి కరెంట్ బిల్లు రసీదు, ఆధార్, రేషన్ కార్డుల జిరాక్సు ప్రతులు, ఫోన్ నెంబర్లు తీసుకొని డాటా ఎంట్రీ చేపడుతున్నారు. మండలంలో 10,758 విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. శుక్రవారం వరకు 8,500 విద్యుత్ కనెక్షన్ల డాటా ఎంట్రీ పూర్తి చేసినట్లు సెస్ ఏఏఈ జి.ప్రశాంత్ తెలిపారు. డాటా ఎంట్రీలో సరైన వివరాలు అందించి సెస్ సిబ్బందికి సహకరించాలని కోరారు. డాటా ఎంట్రీలో సెస్ లైన్‌మెన్ కనకయ్య, కారోబార్ చెలిమల్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు ఆహ్వానం


ఆగయ్యకు పత్రిక అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీహన్మాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు హాజరు కావాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులకు శుక్రవారం ఆహ్వానం పలికారు. ఈనెల 18 నుంచి 22 వరకు ఆలయం ప్రారంభం, ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకలకు రావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు నిమ్మ మల్లారెడ్డి, ప్రతినిధులు మోతే మధుసూదన్‌రెడ్డి, మోతే నర్సింహారెడ్డి, నిమ్మ బుచ్చిరెడ్డి, మోతే లక్ష్మారెడ్డి, గౌడ సంఘం ప్రతినిధులు బొల్గం రాధాకృష్ణ, లింగాల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టుపై అవగాహన సదస్సు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

తంగళ్లపల్లి: జిల్లెల్ల గ్రామంలో రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాబు జగ్జీవన్‌రాం వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం వర్మీకంపోస్టు ఉపయోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వర్మీకంపోస్టు తయారీ విధానం, దాంతో కలిగే ఉపయోగాలపై వివరించారు. వ్యవసాయ విద్యార్థులు ఆకాంక్ష, అనిల్, అనూష, గురువరన్, జాహ్నవి, జెరుష పర్విస్, మనీష, నవీన్, నవ్య, నాహిద్ పర్వీన్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎంపీపీ వెంకటరమణారెడ్డి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంజూరు చేసిన రూ.30.50లక్షల నిధులతో ఇల్లంతకుంట మండల కేంద్రంలో డ్రెయినేజీల నిర్మాణానికి ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు డ్రెయినేజీ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, మాజీ సర్పంచ్ కూనబోయిన భాగ్యలక్ష్మీ బాలరాజు, సీనియర్ నాయకుడు చిట్టి ఆనందరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మామిడి నరేష్, ఏఈ అజారుద్దీన్, పంచాయతీ కార్యదర్శి వరుణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆటోవాలాల ఆందోళన


తంగళ్లపల్లిలో రోడ్డుపై ధర్నా చేస్తున్న ఆటోవాలాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్రధాన రహదారిపై శుక్రవారం ఆటోవాలాలు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని విరమించుకోవాలన్నారు. ఈ పథకంతో తమ ఉపాధి దెబ్బతింటోందని వాపోయారు. ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆటో డ్రైవర్లు ఖరీమ్, సలీమ్, యుగేందర్, శ్రీనివాస్, రాజు, మల్లేశం, బాలయ్య, ఖాసీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోవాలి

బోయినపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం ఆటో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకంతో ఉపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలని కోరారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు


సిరిసిల్లటౌన్: సూర్య నమస్కారాలు చేస్తున్న యోగా ప్రతినిధులు


వేములవాడఅర్బన్: విద్యార్థుల సూర్య నమస్కారాలు

సిరిసిల్లటౌన్: రథసప్తమి రోజును జిల్లా కేంద్ర ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అన్ని ఆలయాల్లో పూజలు చేశారు. మహిళలు, భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు. ఇంగ్లిష్ యూనియన్ పాఠశాలలో తపోవన యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్టు ఆధ్వర్యంలో సామూహిక సూర్య నమస్కారాల సాధన కార్యక్రమం చేపట్టారు. యోగా శిక్షకుడు ఎలిగేటి కృష్ణ, పాఠశాల కరెస్పాండెంట్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల సూర్య నమస్కారాలు

వేములవాడఅర్బన్: పట్టణంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో రథసప్తమి సందర్భంగా విద్యార్థులకు సూర్య నమస్కారాల పోటీని నిర్వహించారు. ఉదయం విద్యార్థులు సూర్య నమస్కారాలు చేశారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో విద్యార్థులు అత్యధిక సూర్య నమస్కారాలు చేసి మొదటి స్థానంలో నిలిచారు.

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడి రాజీనామా

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి శుక్రవారం ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు. కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లోకి వస్తున్నారన్నారు. ప్రాజెక్టుల నుంచి గొర్రెల పెంపకం పథకంలోనూ బీఆర్ఎస్ నాయకులు అవినీతికి పాల్పడ్డారన్నారు. రాష్ట్రంలో ఆ నలుగురే కాకుండా ఈ ప్రాంతంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు కూడా నిస్సిగ్గుగా దోపిడీకి పాల్పడ్డారన్నారు. అధికారం కోల్పోయి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు మతిభ్రమించి అసెంబ్లీలో మాడుతున్నారన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళితబంధు, పోడుభూముల పట్టాలు ఇప్పిస్తామని స్థానిక బీఆర్ఎస్ నాయకులు దోపిడీకి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, బుగ్గ కృష్ణమూర్తి, నాయకులు మల్లారెడ్డి, దేవయ్య, లింగంగౌడ్, గంట బుచ్చగౌడ్, అనవేని రవి, రాంరెడ్డి, శ్రీనివాస్, గుర్రం రాములు, రాజు, సురేష్, బాలయ్య పాల్గొన్నారు

ఆసుపత్రి భవన పనులు పరిశీలన

చందుర్తి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఎంపీపీ లావణ్య శుక్రవారం పరిశీలించారు. భవన నిర్మాణానికి భూమిపూజ చేసి ఏడాది కాలం గడుస్తున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయని తమ దృష్టికి రావడంతో పరిశీలించినట్లు తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు వైద్య సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల సమస్యలున్నాయా అని వైద్య సిబ్బందినడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి నిస్సా, మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

బీమా చెక్కు అందజేత

వేములవాడఅర్బన్: సంకెపల్లి గ్రామానికి చెందిన కాచం ప్రభాకర్ నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బీఆర్ఎస్ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు అందించారు. సెస్ డైరెక్టర్ హరిరణ్‌రావు, ఆర్‌సీరావు, మల్లేశం, కనకరాజు, బూర బాబు, జింక శ్రీధర్, నాగుల రాము, బండారి శ్రీనివాస్, మల్లేశం, పర్శరాం, బాలయ్య తదితరులున్నారు.

పరామర్శ

వీర్నపల్లి: మండల కేంద్రంలో ఇటీవల ఆటో ప్రమాదంలో గాయపడిన కుటుంబాలను కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మద్దిమల్ల గ్రామంలో గత నెలలో మృతి చెందిన గణేశ్ కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు హరిలాల్, చంద్రమౌళి, లక్ష్మణ్, కాంతయ్య, శివరామకృష్ణ, తిరుపతి, శ్రీనివాస్, రవి, సంజీవ్, రమేశ్ తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోనరావుపేట: మల్కపేట గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ నుంచి పోతిరెడ్డిపల్లి మీదుగా మల్కపేటకు ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నారు. ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుల్ జగన్ అనుమతి పత్రాలు పరిశీలించగా.. ఎలాంటి అనుమతులు లేవని తేలడంతో కోనరావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వ్యక్తికి మూడేళ్ల జైలు

కోనరావుపేట: దాడికి పాల్పడిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష పడినట్లు ఎస్సై అంజనేయులు తెలిపారు. 2017 జూలై 27న కోనరావుపేట వైన్స్‌లో మద్యం కొనుగోలు చేస్తున్న వట్టిమల్లకు చెందిన బండ రాజు, కుమ్మరి మల్లయ్యపై కోనరావుపేటకు చెందిన సామల బాబు అకారణంగా గొడవ పెట్టుకొని రాజు పొట్టపై మద్యం బాటిల్‌తో కొట్టగా గాయాలయ్యాయి. అతడి బారి నుంచి ప్రాణాలు కాపాడుకోవడానికి గోడ దూకి పారిపోతుండగా.. రాజు కాలు విరిగి గాయాలయ్యాయి. బాధితుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రమేశ్‌నాయక్ కేసు నమోదు చేశారు. శుక్రవారం విచారణ జరిపిన ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీణ్ తీర్పు నిచ్చారు. సామల బాబుకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించారు.

రుణాలు పొంది ఆర్థికంగా స్థిరపడాలి

ఎల్లారెడ్డిపేట: మహిళా సంఘాల్లోని సభ్యులు వివిధ వ్యాపారాల కోసం రుణాలు తీసుకొని ఆర్థికంగా స్థిరపడాలని డీపీఎం సుధారాణి, ఏపీఎం సుదర్శన్ పేర్కొన్నారు. లఖ్‌పతి దీదీపై శుక్రవారం మండల కేంద్రంలోని ఆఫీస్‌లో అవగాహన కల్పించారు. రుణాలతో జీవనోపాధి కల్పించి ఆర్థికంగా ఆదాయం వచ్చేలా ప్రణాళికలు తయారు చేయడమే లఖ్‌పతి దీదీ ఉద్దేశమన్నారు. ఏపీఎం మల్లేశం, సీసీలు, మండల సమాఖ్య అకౌంటెంట్ రమ, సీబీవో ఆడిటర్ హరికృష్ణ, బ్యాంక్ లింకేజీ సీసీ శ్రీకాంత్, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ బాబు పాల్గొన్నారు.

అజ్మత్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



గంభీరావుపేట: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువనేత సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా ఎన్నికై పదవీ బాధ్యతలు చేపట్టబోతున్న సందర్భంగా పలువురు పార్టీ నాయకులు శుక్రవారం ఆయనను హైదరాబాద్‌లో కలిశారు. అజ్మత్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చీటి ఉమేష్‌రావు, నాయకులు దమ్మ శ్రీనివాస్‌రెడ్డి, తాజోద్దీన్, జోగు సురేష్, కడవేర్గు ప్రకాష్, మదన్‌నాయక్, బందెల రాజు తదితరులున్నారు.

కోదండరెడ్డిని కలిసిన నర్సయ్య



సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీ జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డిని పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య శుక్రవారం కలిశారు. హైదరాబాద్ గాంధీ భవన్లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

రాజ్యసభ సభ్యుడి ఎన్నికపై సంబరాలు


మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం గౌరవ అధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్ర రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయిన సందర్భంగా ఎల్లారెడ్డిపేట మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పాత బస్టాండ్‌లో సంబరాలు నిర్వహించారు. టపాకాయలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు నంది కిషన్ మాట్లాడుతూ.. రవిచంద్రకు రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, ఎంపీటీసీ సభ్యుడు ఉప్పుల మల్లేశం, మున్నూరుకాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మీసం రాజం, ప్రతినిధులు బండారి బాల్‌రెడ్డి, వడ్నాల భాస్కర్, వెంకటయ్య, శ్రీనివాస్, శేఖర్, రాంచందర్, కిష్టయ్య, సత్తయ్య, ఆనందం, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఎస్సైకి సత్కారం

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండల పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా ఐదు నెలలుగా సమర్థవంతంగా విధులు నిర్వహించి బదిలీల్లో భాగంగా తంగళ్లపల్లికి వెళుతున్న ఎస్సై దాస సుధాకర్‌ను ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య, ఏలేటి మాధవరెడ్డి, గాజుల రాములు, పోతరాజు పర్శరాం, మామిడి నరేష్, రామకృష్ణ, న్యాత అశోక్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీని కలిసిన ఎంపీడీవో



తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలానికి నూతనంగా ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసమూర్తి శుక్రవారం ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీటీసీ తీగల పుష్పలత, ఏఈ అజారుద్దీన్, మామిడి నరేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రంగి ఎంపీడీవోగా నటరాజ్

రుద్రంగి: రుద్రంగి ఎంపీడీవోగా నటరాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రుద్రంగి ఎంపీడీవోగా విధులు నిర్వహించిన మాలోతు శంకర్ జగిత్యాల జిల్లాకు బదిలీపై వెళ్లగా.. నిజామాబాద్ జిల్లాలో విధులు నిర్వహించిన నటరాజ్ బదిలీపై వచ్చి రుద్రంగి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

నృత్య ప్రదర్శన

సిరిసిల్లటౌన్: సిరిసిల్లకు చెందిన లంబోదర కల్చరల్ అకాడమీ నృత్య గురువు నక్క అశోక్ ఆధ్వర్యంలో 108 మంది చిన్నారులతో బృంద నృత్యం ప్రదర్శన నిర్వహించారు. అనంత సాగర్ శ్రీసరస్వతి క్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమం స్పిరిచ్వల్ బుక్ ఆఫ్ వరల్డ్, ఫ్యూచర్ స్టార్ ఆఫ్ రికార్డుకు నమోదైంది.

అధికారులకు సన్మానం



ముస్తాబాద్: ముస్తాబాద్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో భాస్కర్‌శర్మను కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ ప్రత్యేకాధికారులుగా పని చేస్తున్న ఇద్దరు అధికారులు మరింతగా పని చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. తహసీల్దార్‌ను డీలర్ల సంఘం సన్మానించింది. చీకోడు చింతల చెరువును నింపొద్దని బాధిత రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, గజ్జెల రాజు, నరేశ్, శీల ప్రశాంత్, కొండల్‌రెడ్డి, గాంత రాజు, కొప్పు రమేశ్, భాను, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కలిగి ఉండాలి

రుద్రంగి(వేములవాడ): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు శుక్రవారం రుద్రంగి మండల కేంద్రంలో మెగా డ్రైవింగ్ లైసెన్సు మేళా కార్యక్రమం నిర్వహించారు. వాహనదారుల నుంచి డ్రైవింగ్ లైసెన్సు దరఖాస్తులను స్వీకరించారు. రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్, రుద్రంగి పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.